నిత్య యోగాతో ఆరోగ్యం


పుల్లలచెరువు: యోగా చేస్తున్న చిన్నారులు, ఉద్యోగులు


తాళ్లూరు: యోగాసనాలు వేస్తున్న అధికారులు

పుల్లలచెరువు: నిత్యం యోగా చేస్తే ఆరోగ్యం ఉంటుందని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు సచివాలయాల పరిధిలో యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పలు కేంద్రాల్లో పాల్గొని యోగా చేసి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి యోగా చేయడం నేర్చుకోవాలని, యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

తాళ్లూరు: యోగాతో మంచి ఆరోగ్యం ఉంటుందని, యోగాసనాలు జీవన శైలిలో ఒక భాగంగా చేసుకోవాలని ఎంపీడీవో దారా హనుమంతురావు కోరారు. మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో శనివారం యోగా భ్యాసంపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓతో పాటు తహసీల్దార్ సంజీవరావు, ఎంఈఓ-2 సుధాకరరావులు పాల్గొని యోగా భ్యాసం విశిష్టతను వివరించారు. అనంతరం ఆయా పంచాయతీలు, పాఠశాలల్లో చేస్తున్న యోగా భ్యాసంపై గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.

ఆలయ భూములకు కౌలు వేలం


కౌలు వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తాళ్లూరు: మండలంలోని పలు దేవాలయాల భూములకు శనివారం బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. శివరామపురం వేణుగోపాల స్వామి ఆలయంలో అగస్త్యేశ్వర ఆలయానికి చెందిన 28.72 ఎకరాల భూమి 8 బిట్లకు, రామభద్రాపురం కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన 14.32 ఎకరాల భూమి 8 బిట్లకు వేలం నిర్వహించారు. అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి గత సంవత్సరం రూ.2.99 లక్షలకు కౌలు పలుకగా ప్రస్తుతం రూ.4.25 లక్షలకు కౌలుకు రైతులు పాడుకున్నారు. అదేవిధంగా కోదండరామ స్వామి ఆలయానికి గత సంవత్సరం రూ.1.48 లక్షలు కౌలు పాడుకోగా ప్రస్తుతం రూ. రూ.1.51 లక్షలకు కౌలుకు రైతులు పాడుకున్నారు. జె.పంగులూరు గ్రూప్ దేవస్థాన కార్యనిర్వాణాధికారి శ్రీనివాసరావు, కార్యనిర్వాహణాధికారి జి.వాసుబాబు, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

సొంత నిధులతో గ్రావెల్ రోడ్డుకు మరమ్మతులు


రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న స్థానికులు

● దాతృత్వం చాటిన ఎంపీపీ గుమ్మా పద్మజ యల్లేష్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని హసానాబాద్‌లో గుంతలమయంగా మారిన ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ గుమ్మా పద్మజ యల్లేష్ తమ సొంత నిధులతో చేపట్టారు. సొంత గ్రామం హసానాబాద్‌కు సంబంధించి ప్రధాన రహదారిలోని ఎస్సీ కాలనీ నుంచి హసానబాద్ వరకు 500 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులను శనివారం నుంచి ప్రారంభించారు. ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్ మాట్లాడుతూ కొద్ది రోజులుగా వర్షాలు పడటంతో ప్రధాన రహదారిలోని రోడ్డు బురద మయంగా మారిందని, దీంతో గ్రామస్తులు ఆ దారిలో ప్రయాణాలు కొనసాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో 8 లక్షల రూపాయల సొంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. దీనికి సంబంధించి రోడ్డుకిరువైపులా జేసీబీతో కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన ఎంపీపీ గుమ్మా పద్మజ యల్లేష్‌ను గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు.

పవనకుమారునికి ప్రత్యేక పూజలు

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరం ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు పాల్గొని ఆలయ పూజారి శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామిదర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దొనకొండ ఏఓగా బాలకృష్ణ నాయక్


బాలకృష్ణనాయక్, ఏఓ

దొనకొండ: మండల కేంద్రం దొనకొండ నూతన వ్యవసాయాధికారిగా వి.బాలకృష్ణనాయక్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన దర్శి మండలం నుంచి బదిలీపై దొనకొండకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ పెద్దారవీడు మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు.

ఆపదలో చేయూత


చెక్కు అందజేస్తున్న మానవత ప్రతినిధులు

దర్శి (కురిచేడు): దర్శి నగర పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న బోడెపోగు రాంబాబు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ యజమాని అకాల మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రాంబాబు కుటుంబ సభ్యులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆపన్న హస్తం అందించింది. శుక్రవారం రాత్రి ఆ కుటుంబానికి తమ సానుభూతి ప్రకటించి రూ.5 వేల చెక్కును సంస్థ ప్రతినిదులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు కపురం శ్రీనివాసరెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, గొర్రెపాటి వేణు, అడపాల గణేష్, జె.సుశీలమ్మ, రోశారావు, జూపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా పునీత ఆంథోని చర్చి మహోత్సవం


మాట్లాడుతున్న ఆంథోని దాస్

దొనకొండ: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పునీత ఆంథోని ఆలయ మహోత్సవం విచారణ గురువు ఫాదర్ గుడిపల్లి థామస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహోత్సవానికి నెల్లూరు మేత్రాసనం సహవారస పీఠాధిపతులు డాక్టర్ పిల్లి ఆంథోనిదాస్ అతిథిగా హాజరై దివ్యబలి పూజ సమర్పించారు. ఉదయం నుంచి పిల్లలు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చి దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పునీత ఆంథోని వారి జీవితంలోని అద్భుత విషయాలను ఆయన వివరించారు. అనంతరం పునీత ఆంథోని వారి తేరును పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి వీధుల్లో మేళతాళాలతో గీతాలాపన చేస్తూ ఉత్సవం చేశారు. విచారణ గురువులు గుడిపల్లి థామస్, సహాయ గురువులు వినోద్‌కుమార్, గురుశ్రీ పిడతల జోసఫ్, గురుశ్రీ కలివెల చంద్ర, ఇతర గురువులు, ఆరోగ్యమాత సిస్టర్స్ పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు


ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గొంద్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహోత్సవాలను పురస్కరించుకొని ఐదో రోజు ఉత్సమూర్తులు గరుడ వాహనంపై శనివారం ఉంచారు. శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథ స్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, మంగళ హారతి, ప్రసాద వితరణ తదితర పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పగలు ఉత్సవం పల్లకిలో రాత్రి గరుడ వాహనంపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామిని ఆలయం ప్రాంగణంలో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉభయదాతలుగా బోయినపల్లి చిన్నసత్యనారాయణ, ఓరుగంటి విద్యాసాగర్, పెరుగుపల్లి సుబ్రహ్మణ్యం, పవన్‌కుమార్, కొండూరు ఆదినారాయణశర్మలు వ్యవహరించారు. బ్రహ్మణ, రెడ్ల సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి బాధ్యతగా పనిచేస్తా..


గోపనబోయిన పెద్ద శ్రీను

ముండ్లమూరు (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముండ్లమూరు ఎస్సీసెల్ అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో నియమించినందుకు పార్టీ అభివృద్ధి కోసం బాధ్యతగా పనిచేస్తానని గోపనబోయిన పెద్ద శ్రీను పేర్కొన్నారు. తనకు పదవి ఇచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



విద్యా కేంద్రంగా మార్కాపురం


మార్కాపురం పట్టణం వ్యూ

మార్కాపురం: విద్యా కేంద్రంగా మార్కాపురం వెలుగొందుతోంది. ఈ ప్రాంత విద్యార్థులు ఒకప్పుడు విద్యకోసం సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో ప్రస్తుతం అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో అనేక విద్యా సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తూ పట్టణంలో పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు మెరుగైన విద్యనందిస్తున్నాయి. ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయి. మార్కాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలైన తర్లుపాడు, పెద్దారవీడు, మార్కాపురం రూరల్ నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యశిస్తున్నారు. పలు ఇంజినీరింగ్, ఫార్మసీ, లా, అగ్రికల్చర్, నర్సింగ్ కళాశాలలు ఉండటంతో చుట్టుపక్కల జిల్లాలతోపాటు దూర ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థుల సౌకర్యం కోసం బస్ సౌకర్యంతోపాటు హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు సౌకర్యంగా వసతులు ఏర్పాటు చేస్తున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించి, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు క్రీడలు, సంగీతం, నృత్యాల్లో శిక్షణ ఇప్పించి మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారయ్యేలా తోడ్పాటు అందిస్తున్నారు. విద్యార్థుల్లో ప్రతిభా నైపుణ్యాలను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌లుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా తయారై దేశ, విదేశాల్లో కొలువులు సాధించారు. లక్షల్లో జీతాలు అందుకుంటున్నారు. ఉన్నత విద్యల్లో రాణించడమే కాకుండా ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. పట్టణంలోని మార్కాపురం-తర్లుపాడు రోడ్డులో శ్రీ సాయి బాలాజీ స్కూల్, పట్టణంలోని జీఎంఆర్ హైస్కూల్, కళాశాల రోడ్డులోని శ్రీ అరవింద హైస్కూల్, శ్రీ సాయి చైతన్య హైస్కూల్, పట్టణంలోని నాగులవరం రోడ్డులో ఉన్న విజ్ఞాన్ హైస్కూల్‌లతో పాటు జ్ఞానశ్రీ అకాడమీ విద్యార్థులు ఉత్తమ విద్యాబోధనతో మార్కాపురంలో విద్యా రంగానికి తలమానికంగా ఉన్నాయి.

విద్యా రంగంలో దూసుకెళ్తున్న విద్యా సంస్థలు


గిద్దలూరు పట్టణం వ్యూ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో పలు విద్యా సంస్థలు విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు గిద్దలూరులో పలు ప్రైవేటు విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను చేరువచేశారు. క్రమశిక్షణతో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. గిద్దలూరు విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని విశ్వభారతి ఐఐటీ ఫౌండేషన్ స్కూల్, సూర్య విద్యానికేతన్ స్కూల్, అరుణోదయ పబ్లిక్ స్కూల్ వంటి ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాయి. విద్యారంగంలో గిద్దలూరు చుట్టుపక్కల గ్రామాల్లో మంచి గుర్తింపు సాధించాయి.